క్లుప్తంగా

వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మెట్‌పల్లిరూరల్: మేడిపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామస్తులకు బుధవారం బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు చేశారు. మొత్తం 200 మందికి పైగా గ్రామస్తులు శిబిరానికి తరలివచ్చారు. వైద్యుడు విజయ్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఇండియన్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు నడపాలి



కోరుట్ల డీఎంకు వినతిపత్రం ఇస్తున్న గంభీర్‌పూర్ గ్రామస్తులు

కథలాపూర్: గంభీర్‌పూర్ గ్రామానికి గతంలో మాదిరిగా రెండు ఆర్టీసీ బస్సులను యథావిధిగా నడిపించాలని గ్రామస్తులు బుధవారం కోరుట్ల డీఎం మనోహర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బస్సుల ట్రిప్పుల సంఖ్య తగ్గించడంతో కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కోరుట్లకు వెళ్లే వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



పాఠాలు చెప్పిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలు జరిపినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలి



జెండా, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్: ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఉత్సవాల జెండా, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సారుగు రమేశ్, పల్లి మధు, బొండ్ల రవి, యామ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక డంపు వేలం

మల్లాపూర్: తహసీల్ కార్యాలయంతోపాటు సాతారం శివారులో సీజ్ చేసిన ఇసుక డంపునకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు, పోలీసులు వేర్వేరుగా దాడులు నిర్వహించి పట్టుకున్నారన్నారు. రెవెన్యూ అధికారులు సాతారంలో పట్టుకున్న 13 ట్రిప్పుల ఇసుకతోపాటు పోలీసులు పట్టుకొని తహసీల్ కార్యాలయానికి తరలించిన 10 ట్రిప్పుల ఇసుక వేలం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



భూపతిపూర్‌లో కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో

రాయికల్: భూపతిపూర్ గ్రామంలో ప్రపంచ టాయిలెట్ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పారిశుధ్య కార్మికులను ఎంపీడీవో చిరంజీవి ఘనంగా సన్మానించారు. ప్రత్యేక అధికారి సుష్మ, కార్యదర్శి హరికృష్ణ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గొల్లపల్లి: హిందూ జన జాగృతి కోసం చేపడుతున్న సనాతన ధర్మ రథయాత్ర పోస్టర్‌ను బుధవారం విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆవిష్కరించారు. జిల్లా గోరక్షక్ ప్రముఖ్ ఆడెపు నరేశ్ మాట్లాడారు. కుంబార్కర్ అరుణ్, ఆవుల వెంకటేశ్, అంకం సతీశ్, రమేశ్, విజయ్, అజయ్, రాహుల్ పాల్గొన్నారు.

మెడిటేషన్ తరగతులు ప్రారంభం

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి వారం రోజులపాటు జరిగే మెడిటేషన్ తరగతులు ప్రారంభమయ్యాయి. రామకృష్ణ మిషన్ సంస్థ ప్రతినిధి మంచాల కృష్ణ మాట్లాడుతూ.. యోగా ఆవశ్యకతపై వివరించారు. ఏనుగుల మల్లయ్య, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిధులున్నా.. పనులు సున్న..

- పట్టణంలో స్థలాల్లేక నిధులు వెనక్కి?
- ప్రభుత్వ స్థలాల కోసం అన్వేషణ
- మూడు నెలల్లో ముగియనున్న పాలకవర్గం గడువు



రాయికల్ మున్సిపాలిటీ కార్యాలయం



రాయికల్ పట్టణం

రాయికల్: మరో మూడు నెలల్లో మున్సిపల్ పాలక మండలి గడువు ముగియనుంది. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగా, పలు భవనాల నిర్మాణానికి స్థలాలు లేక నిధులు వాపస్ పోయే ప్రమాదం ఉంది. గ్రంథాలయ నిర్మాణానికి రూ.50 లక్షలు, సమీకృత మార్కెట్ కోసం రూ.3 కోట్లు, అమృత్ 2.0 కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయి. రాయికల్ పట్టణంలో వీటి నిర్మాణాల కోసం స్థలాలు లేకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. దీంతో పట్టణ ప్రజలకు సమీకృత మార్కెట్, గ్రంథాలయం, అమృత్ వంటి పథకాలు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

స్థలాల కోసం అన్వేషణ

రాయికల్ పట్టణంలో గ్రంథాలయ నిర్మాణానికి 10 గుంటలు, సమీకృత మార్కెట్ కోసం 20 గుంటల స్థలం, అమృతధార పథకానికి రూ.15 కోట్లు మంజూరు కాగా వీటి కోసం 20 గుంటల భూమి అవసరం ఉంది. స్థలాల సేకరణ కోసం మున్సిపల్ అధికారులు పాలక మండలి సభ్యులు రాయికల్ పట్టణంలో స్థలాల కోసం వెతుకుతున్నప్పటికీ ఎక్కడ కూడా ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఉన్న పథకాలు పట్టణ ప్రజలకు దూరమయ్యే అవకాశం ఉందని తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా రాయికల్ పట్టణంలో గుంట భూమికి సుమారు రూ.5లక్షల నుంచి రూ.30లక్షల వరకు ధర పలుకుతోంది. వీటి నిర్మాణం కోసం భూమిని కొనుగోలు చేయాలంటే ఆదాయం లేక పాలక మండలి సభ్యులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి రాయికల్‌లో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉందో పరిశీలించి, అభివృద్ధి పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారుల అనుమతితో భూమి కొనుగోలు



రాయికల్ బల్దియాలో ప్రభుత్వ భూమి ఎక్కడా లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములను కొనుగోలు చేసి నిర్మాణం ప్రత్యేక చర్యలు చేటప్టేలా తీర్మానం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు మళ్లిపోకుండా చర్యలు తీసుకుంటాం. ఆయా పథకాలను పట్టణ ప్రజలకు సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపడతాం.

– మోర హన్మండ్లు, మున్సిపల్ చైర్మన్

ప్రభుత్వ స్థలం కోసం అన్వేషిస్తున్నాం



రాయికల్ మున్సిపల్‌లో ప్రభుత్వ స్థలాల కోసం అన్వేషిస్తున్నాం. ముఖ్యంగా రాయికల్ మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఈ పథకాలకు సరైన నివేశ స్థలాలు లేక నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నాం. పాలక మండలి గడువు ముగిసేంత లోపు నిర్మాణాలు చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లే ఉంది.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్



సారంగాపూర్: నెలలుగా ప్రధాన రహదారి కూడలిపై ఇలా ఇనుప చువ్వలు(సలాకలు) బయటకు అత్యంత ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల నుంచి గొల్లపల్లి వైపు వెళ్లే రహదారి ఇది. ఈ కూడలి వద్ద నుంచి ఎడమ వైపు వెళ్తే రాజీవ్‌గాంధీ కూడలి వస్తుంది. ఇక్కడ మలుపు వద్ద రోడ్డునానుకొని ఇలా ఇనుప చువ్వలు మ్యాన్ హోల్‌పై మీటరు ఎత్తు వరకు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే అంతే సంగతులు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల, సెల్ నం.: 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఇంటింటి సర్వేకు సహకరించాలి

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి కృష్ణారావు స్వగృహమైన జువ్వాడి భవన్‌లో కుటుంబ సర్వే నిర్వహించారు. రాజకీయ, ఉద్యోగాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకే ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందన్నారు.

పెగడపల్లి: సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు మండల పరిషత్‌లో అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మండల పరిషత్‌లో 15 కంప్యూటర్లలో నమోదు కోసం 25 మంది ఆపరేటర్లను నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలో సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఎన్యుమరేటర్లకు సూచించారు. కోమటికొండాపూర్ గ్రామంలో సర్వే పనులను పరిశీలించారు. కార్యదర్శి సరిత పాల్గొన్నారు.



జువ్వాడి కృష్ణారావు వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

వరికొయ్యలు కాల్చొద్దు

ధర్మపురి: రైతులు వరి పొలాలు కోసిన తర్వాత వరికొయ్యలను కాల్చుతున్నారని, అలా చేయడంతో భూసారం దెబ్బతింటుందని మండల వ్యవసాయాధికారిణి సింధూజ సూచించారు. దమ్మన్నపేట గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అజయ్‌కుమార్, సొల్ల నరేశ్, డైరెక్టర్లు తదితరులున్నారు.

పెగడపల్లి: వరి పంట కోసిన తరువాత మొదళ్లను తగలబెడితే పంటల దిగుబడి తగ్గి రైతుకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ అన్నారు. మద్దులపల్లి గ్రామంలో బుధవారం అవగాహన కల్పించారు. ఏఈవో పవన్ ఉన్నారు.



ధర్మపురి: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎస్పీని కలిసిన మెట్‌పల్లి డీఎస్పీ



ఎస్పీకి పూల మొక్క అందజేస్తున్న రాములు

జగిత్యాలక్రైం: మెట్‌పల్లి డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాములు బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే, చైర్‌పర్సన్



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల: వేములవాడలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హెలిప్యాడ్ వద్ద స్వాగతించారు. పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎంను జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి కలిశారు. జగిత్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

సీఎం సభకు తరలిన నాయకులు

కథలాపూర్: వేములవాడలో బుధవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, అభిమానులు వాహనాల్లో తరలివెళ్లారు. మండలంలోని 19 గ్రామాల నుంచి 1,500 మంది సభకు వచ్చారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగరాజు తెలిపారు.

ముందస్తు అరెస్టు



కోరుట్లరూరల్: పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

కోరుట్లరూరల్: ముఖ్యమంత్రి వేములవాడ పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులను బుధవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, పట్టణంలోని పలువురు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వదిలిపెట్టారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు సరికాదన్నారు. మాజీ సర్పంచులు కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అంజయ్య, చెప్యాల నర్సయ్య, కోరెపు రవి, నూతిపెల్లి ముత్తయ్య తదితరులున్నారు.

రాయికల్: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌ను బుధవారం వేకువజామున పోలీసులు అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు.

మల్యాల: బుధవారం ఉదయం బీఆర్‌ఎస్ మాజీ సర్పంచులను ఎస్సై నరేశ్‌కుమార్ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచులు ఎడిపెల్లి అశోక్, బద్దం తిరుపతిరెడ్డి, రౌతు రవివర్మ, కుమారస్వామి, బద్దం తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

కథలాపూర్: మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు పిడుగు ఆనంద్‌రెడ్డి, మల్యాల మారుతి, గడ్డం జీవన్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

సారంగాపూర్: బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. పెంబట్ల గ్రామంలో పొంపర్తి నర్సమ్మ, అత్తినేని గంగరాజం, కొలపాక దినేశ్ ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా.. బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.



పెంబట్లలో పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: సినిమాటోగ్రఫీలో షర్ట్‌టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్ తెలిపారు. సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ ఇంజినీరింగ్, ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మీడియా, యాంకరింగ్, డబ్బింగ్, మ్యూజిక్‌లలో హైదరాబాద్‌లో మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెల్ నంబర్ 9440785992లో సంప్రదించాలని కోరారు.

మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డులు అందిస్తున్నట్లు, ఆసక్తి ఉన్న దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు.

జాతీయ ఆరోగ్య మిషన్ కింద వైద్యశాఖలో ఒప్పంద ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. దరఖాస్తుల ఫారం, నోటిఫికేషన్ వివరాల కోసం జిల్లా అధికార వెబ్‌సైట్ నుంచి పొందాలని, పూర్తి చేసిన దరఖాస్తును డీడీ రూపంలో జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మోడల్ స్కూల్లో పీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ సుంకరి రవి తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ పూర్తి చేసినవారు ఈ ఉద్యోగానికి అర్హులని, ఈనెల 23న గొల్లపల్లి మోడల్ స్కూల్లో జరిగే డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: రాయికల్, అల్లీపూర్, వీరాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా గురువారం ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నవీన్ తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల: పట్టణంలో గృహలక్ష్మి హౌసింగ్ సొసైటీ డెవలప్‌మెంట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొలుగేరి శ్రీపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కల్వకోట చంద్రప్రకాశ్, కోశాధికారిగా బెజ్జారపు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా రుద్ర సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా గంగారెడ్డి, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బుగ్గారం: పీఆర్‌టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు భూక్య అశోక్ రాథోడ్‌ను నియమిస్తూ జిల్లా నాయకులు నియామక పత్రాలు అందజేశారు.

యూఎంటీ, యూబీఐటీ కాయిన్ సభ్యుల సంబరాలు

కోరుట్ల: యూఎంటీ, యూబీఐటీ కాయిన్ ప్రవేశపెట్టి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం సభ్యులు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మొక్కలు నాటారు. నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేశారు. కటుకం మురళి, హనుమాండ్లు, గణేశ్, రాజగంగాధర్, రమేశ్, శ్రీహరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే వృద్ధుల సంరక్షణ పాలసీ

కోరుట్ల: తెలంగాణ ఆల్ సీనియర్స్ సిటిజన్స్ పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వృద్ధుల సంరక్షణ పాలసీని రూపొందించేందుకు నిర్ణయించిందని టాస్కా రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ డివిజన్ కార్యాలయంలో బుధవారం కేంద్రం వృద్ధుల సంరక్షణ పాలసీ, సంక్షేమ చట్టానికి సవరణలు అనే అంశంపై సమావేశం నిర్వహించారు.

వీధి కుక్కలపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన వేముల రమేశ్ అనే వ్యక్తి ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటో సీట్లను కుక్కలు ధ్వంసం చేసి రూ.15వేల నష్టం చేశాయని, చర్యలు తీసుకోవాలని బుధవారం పట్టణ సీఐ వేణుగోపాల్‌కు రమేశ్ ఫిర్యాదు చేశారు. 43వ వార్డులోని పోచమ్మవాడకు చెందిన రమేశ్ కొంతకాలంగా ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం తన ఆటోను ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఇంట్లో పడుకున్నాడు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి కుక్కలు సీట్లను చింపేశాయి.

గురుకుల పాఠశాలలో పుస్తక ప్రదర్శన

మెట్‌పల్లి: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో ప్రదర్శించిన పుస్తకాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ సంతోషిణి, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

మహాదేవుడి అనుగ్రహముండాలి



లక్ష్మణ్‌కుమార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

వెల్గటూర్: ఎండపల్లి మండలం కొత్తపేటలో నూతనంగా నిర్మించిన శ్రీశివమార్కండేయ ఆలయ ప్రాణ ప్రతిష్ఠలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయానికి రూ.50వేల విరాళం అందించారు. అనంతరం లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆ మహాదేవుడి దీవెనలు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉండాలని, 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చల్లగా చూడాలని కోరారు. మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్ పోలోజు శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు రమేశ్, గెల్లు శ్రీనివాస్, పద్మశాలీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో పూజలు



ముడుపు కడుతున్న బీజేపీ నాయకులు

గొల్లపల్లి: మల్లన్నపేట గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు మాట్లాడారు. జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో అభ్యర్థులు, కార్యకర్తలను గెలిపించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో ధర్మ రక్షకులను గెలిపించాలని కోరుతూ మల్లికార్జునస్వామికి ముడుపు కట్టారు. సింహాచలం సత్యనారాయణ, గంద్ర ప్రసాద్‌రావు, భైరం నారాయణ, రాఘవరెడ్డి, లక్ష్మారెడ్డి, బీమ మహేశ్, తిరుపతి, లక్ష్మణ్, శ్రీధర్, మల్లయ్య, నరేశ్, లచ్చన్న పాల్గొన్నారు.

సంఘాల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలి

జగిత్యాల: జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సహకార అభివృద్ధి మండలి సమావేశం జరిగింది. కొత్తగా ఏర్పడే సంఘాలు ఆర్థికంగా పరిపుష్టిగా ఉండేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ సహకార సంఘాలతోపాటు మత్స్య, గొర్రెల పెంపకందారుల సంఘం అభివృద్ధికి తోడ్పాటందించాలన్నారు. జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, వ్యవసాయాధికారి మనోహర్, నాబార్డ్ డీడీఎం దిలీప్‌చంద్ర పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రాయికల్: వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. బుధవారం కిష్టంపేట, అయోధ్య, భూపతిపూర్, ఒడ్డెలింగాపూర్, చింతలూరు, బోర్నపల్లి రాయికల్ పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ ఖయ్యూం ఉన్నారు.

ధర్మపురి: రాయపట్నం, తిమ్మాపూర్ గ్రామాల్లో బుధవారం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తిమ్మాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో చైర్మన్ సాయిని సత్యనారాయణతో కలిసి బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య చేతుల మీదుగా వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నాయకులు వేముల రాజు, కుంట సుధాకర్, సత్తయ్య, పాలకవర్గ సభ్యులు, రైతులు తదితరులున్నారు.

గర్భిణులను పరీక్షించాలి

సారంగాపూర్: గర్భిణలకు అవసరమైన పరీక్షలు తప్పనిసరిగా చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీర్‌పూర్‌లోని పల్లె దవఖానాలను సందర్శించారు. పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు సకాలంలో అందించాలన్నారు. టీబీ నివారణకు గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. వైద్యులు శ్రీనివాస్, శివకుమారి, సీహెచ్‌వో కుద్దూస్, సూపర్‌వైజర్ కిశోర్, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు టీషర్టులు పంపిణీ

రాయికల్: అల్లీపూర్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పొలాస శ్రీధర్ పాఠశాలలో చదువుకుంటున్న 300 మంది విద్యార్థులకు రూ.60వేల విలువైన టీషర్టులను అందించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరికీ లేబర్ కార్డు అందించాలి

జగిత్యాల: అర్హులైన వారందరికీ ప్రభుత్వం లేబర్ కార్డు అందించాలని జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి రాంబాబు అన్నారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. అల్ఫోర్స్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు స్వరళి, అన్విత ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కాంస్య పతకాలు సాధించగా.. బుధవారం వారిని అభినందించారు.

జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, పాటల పోటీల్లో ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నాగుల నవదీప్ ప్రతిభ కనబర్చి బహుమతి, ప్రశంసాపత్రం పొందారు. ప్రిన్సిపాల్ నాగభూషణం, అధ్యాపకులు అభినందించారు.

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన రుద్వేద్, కృష్ణ జమ్ముకాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పెనాక్స్ విభాగంలో రజత పతకం సాధించగా.. రుత్విక్ కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు, కరాటే మాస్టర్ ప్రభాకర్ తెలిపారు.

మల్యాల: తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు మెట్‌పల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చారు. అండర్-10 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఐదోతరగతి విద్యార్థిని కె.దేవి, అండర్-12 విభాగం లాంగ్ జంప్‌లో ఏడోతరగతి విద్యార్థిని ఎ.హర్షిత, అండర్-12 విభాగంలో 400 మీటర్లలో ఏడోతరగతి విద్యార్థిని బి.కీర్తన ద్వితీయ బహుమతి సాధించారు.